క్లుప్తంగా

ఘనంగా ఆలయాల వార్షికోత్సవం



నిమ్మకాయల అలంకరణలో అభయాంజనేయస్వామి

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో కొలువై ఉన్న షిర్డీ సాయి, పార్వతమ్మ ఆలయాల 19వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పరిషత్, మండపారాధన, అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. ఆలయ ధర్మకర్త మొకర అప్పలనాయుడు, సన్యాసమ్మ దంపతులు ప్రథమ పూజ చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆలయాల ప్రాంగణంలో భారీ అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని అప్పలనాయుడు తెలిపారు.

పద్మనాభం: మండలంలోని మద్ది జంక్షన్‌లో గురువారం అభయాంజనేయస్వామి ఆలయ 19వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని నిమ్మకాయల మాలతో అలంకరించారు. అనంతరం నాలుగు వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. మద్దితోపాటు తునిపాలెం, పద్మనాభం గ్రామాల భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

పింఛన్ల పంపిణీ



దివ్యాంగునికి పింఛన్ నగదు అందజేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో 22, 24 క్లస్టర్లలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

తగరపువలస: ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన దక్షిణ భారత హిందీ ప్రచారసభ (చెన్నై) హయ్యర్, లోయర్ పరీక్షలకు సంబంధించిన సర్టిఫికెట్లను విద్యార్థులకు గురువారం అందజేశారు. భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు వీటిని అందించారు. మూడో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండమ్మ పాల్గొన్నారు.

రామాలయంలో అన్నదానం



జ్యూట్ మిల్లు రామాలయంలో అన్నదానం జరుపుతున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో గురువారం నుంచి అన్నదానం పునరుద్ధరించారు. గత నెల 4న ఆలయ ప్రధాన అర్చకుడు ఆకెళ్ల నరసింహమూర్తి అకాల మరణంతో నిలిచిన అన్నదానాన్ని ఆయన కుమారులు భాగ్యరాజా, రవిగణేష్ పునరుద్ధరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకపై ప్రతి గురువారంతోపాటు పుణ్య దినాలలో అన్నదానం జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో భానుమతి, రమాదేవి, జీరు వెంకటరెడ్డి, పిల్లా రాజేష్, జీరు భరత్ రెడ్డి, మల్లిబాబు తదితరులు పాల్గొనగా స్థానికులు సహాయ సహకారాలు అందించారు.

బస్ షెల్టర్లు లేక ఇక్కట్లు

- ఎండకు ఎండి, వానకు తడుస్తున్న ప్రయాణికులు
- బస్సుల కోసం రోడ్లపైనే పడిగాపులు



చేపల మార్కెట్ వద్ద నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్



విజయనగరం వెళ్లే రూట్లో మండుటెండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఆనందపురం : ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకొని వివిధ రోడ్ల కలయికతో ఏర్పడిన ఆనందపురం జంక్షన్‌లో ఒక్క బస్ షెల్టర్ కూడా లేకపోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఐదేళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. రోడ్లను విస్తరించే సమయంలో వాటిని ఆనుకొని ఉన్న బస్ షెల్టర్లను తొలగించాల్సి వచ్చినప్పుడు పనులు పూర్తి అయిన వెంటనే ప్రయాణికుల సౌకర్యార్థం షెల్టర్లు పునరుద్ధరించాల్సి ఉంది. కానీ ఆనందపురం జంక్షన్‌లో మాత్రం అలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ట్రాఫిక్‌కు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

రోడ్లు నిర్మించి ఐదేళ్లవుతున్నా...

పాత రోడ్డుని ఆరు లైన్ల రహదారిగా విస్తరించినప్పుడు ఆనందపురం జంక్షన్‌లో వివిధ మార్గాల్లో ఉన్న బస్ షెల్టర్లను తొలగించారు. రోడ్డు పని పూర్తి అయి ఐదేళ్లు కావస్తున్నా ఎక్కడా షెల్టర్లు నిర్మించలేదు. దీంతో రోడ్డు అంచులపైన, పక్కన గల బడ్డీల నీడను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. బస్సులు నిలుపదల చేయడానికి నిర్దేశిత స్థలం లేకపోవడంతో ఒక్కోసారి ప్రయాణికుల కోసం రోడ్డు మధ్యలోనే నిలిపి వేస్తున్నారు. దీంతో మూడు వైపుల నుంచి ఒకేసారి వాహనాలు చేరుకోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఆనందపురం జంక్షన్ గుండా శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, పెందుర్తి, అనకాపల్లి ప్రాంతాలకు షటిల్ బస్సులతోపాటు అంతర్రాష్ట్ర సర్వీసులు నడుస్తున్నాయి. ఇక్కడ బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులకు నిలువ నీడ లేక ఎండకు ఎండి వానకు తడిచి ఇక్కట్లు పడుతున్నారు. అలాగే ఏ బస్సు ఎక్కడ ఆగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొనడంతో బస్సు కనిపిస్తే చాలు ఆపకుండా వెళ్లిపోతుందని కంగారులో రోడ్డు మధ్యలో నుంచే పరుగులు పెడుతున్నారు. దీంతో ప్రమాదాలు సంభవించడంతోపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇదిలా ఉండగా చేపల మార్కెట్ వద్ద ఫ్లైఓవర్‌ని ఆనుకొని బస్ షెల్టర్‌ను నిర్మించారు. కానీ ఆ మార్గం గుండా అస్సలు బస్సులు నడవవు. దీంతో బస్ షెల్టరు నిరుపయోగంగా పడి ఉండడంతో ఆటోస్టాండ్‌గా ఉపయోగపడుతోంది.

వృద్ధులు, వికలాంగులకు అవస్థలు



బస్సుల కోసం వేచి చూసే వృద్ధులు, వికలాంగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్సులు వచ్చే వరకూ సేదతీరడానికి అవకాశం లేకుండా ఉంది. దీంతో ఎండా, వానకు గురికావాల్సి వస్తోంది. షెల్టర్లు నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– షిణగం సత్యనారాయణ, వేములవలస

రోడ్లపైనే నిరీక్షణ



బస్సులు ఎక్కడ ఆగుతాయో తెలియక రోడ్డు పైనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. ట్రాఫిక్ ఇబ్బందుల వల్ల బస్సులను రోడ్డు మధ్యలో నిలిపి వేయడంతో వాటిని చేరుకోవడానికే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. షెల్టర్లను ఏర్పాటు చేసి బస్సుల రాకపోకల వివరాలను అందుబాటులో ఉంచితే ఉపయోగకరంగా ఉంటుంది.

– పతివాడ నరిసింగరావు, ఆనందపురం జంక్షన్

వరుస చోరీలతో బెంబేలు



గదిలో చెల్లాచెదురుగా పడేసిన దుస్తులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో వరుస చోరీలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల గుడ్లవానిపాలెంలోని రెండు నివాసాల్లో జరిగిన చోరీలు మరవక ముందే బుధవారం అర్ధరాత్రి మరో ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుడ్లవానిపాలెం ఓషన్ డ్రైవ్ లే అవుట్‌ను ఆనుకుని ఉన్న ఓ గృహ సముదాయంలోని ఇంటిలో చోరీ జరిగింది. నారా పవన్‌కుమార్ సాగర్‌నగర్‌లో మెడికల్‌షాపు నిర్వహిస్తూ గుడ్లవానిపాలెంలో నివసిస్తున్నారు. అయితే బంధువులు రావడంతో బుధవారం రాత్రి సాగర్‌నగర్‌లో ఉన్న సోదరి ఇంటికి కుటుంబంతో కలిసి వెళ్లిపోయారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు విరగ్గొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ సంఘటనలో రూ.2.5 లక్షల నగదు, 20 గ్రాములు బంగారం పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఆరిలోవ సీఐ ఇమాన్యుయేల్ రాజ్ సంఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు మధ్యలో స్తంభాలతో ప్రమాదాలు



చిప్పాడలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీలో ఆలయ ముఖద్వారం నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారి మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకైన ఈ రహదారిని ఇటీవల విస్తరించినప్పుడు స్తంభాలు మార్చకుండానే పనులు చేయడంతో ప్రస్తుతం రోడ్డు మధ్యలో స్తంభాలు ఉన్నాయి. దీంతో ఈ రహదారిలో ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర మినీవాహనాలు రాకపోకలు సాగించే సమయంలో స్తంభాలు తగులుకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్కోసారి ద్విచక్ర వాహనదారులు కూడా స్తంభాలను ఢీకొంటున్నారు. ఈ విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చాలని చిప్పాడ గ్రామ ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా బుధవారం వేళ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు.

ఆకర్షణీయంగా రైతు బజార్ స్టాల్స్

- రైతు బజార్ల రాష్ట్ర సీఈవో నందకిషోర్



రైతుబజార్‌లో పరిసరాలు పరిశీలిస్తున్న నందకిషోర్

మధురవాడ: రైతుబజార్ పరిసరాలు ఆకర్షణీయంగా, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతుబజార్ల ముఖ్య కార్యదర్శి ముల్లంగి నందకిషోర్ ఆదేశించారు. గురువారం ఆయన మధురవాడ రైతుబజార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వినియోగదారులు, రైతులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అప్రోచ్ రోడ్డులో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు, పరిసరాలు పరిశుభ్రత, తదితర సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పార్కింగ్ సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను నందకిషోర్ ఆదేశించారు. అలాగే స్టాల్స్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి ఆకర్షణీయంగా చేయాలన్నారు. ఆయనవెంట జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్, మధురవాడ ఎస్టేట్ ఆఫీసర్ జగదీష్ తదితరులు ఉన్నారు.

శ్మశానవాటికకు స్థలం కోసం వినతి

పద్మనాభం: క్రైస్తవులకు శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు పాస్టర్లు గురువారం వినతిపత్రం ఇచ్చారు. పాండ్రంగి వచ్చిన ఎమ్మెల్యేను వీరు కలిశారు. అక్కడే ఉన్న కలెక్టర్ మల్లికార్జున దృష్టికి ఎమ్మెల్యే ఈ సమస్యను తీసుకెళ్లారు. దీంతో శ్మశాన వాటికకు స్థలం కేటాయించేందుకు కలెక్టర్ సుముఖత వ్యక్తం చేశారు. ఎంపీటీసీల కో – ఆప్షన్ సభ్యుడు దున్న అబ్రహం, పాస్టర్లు సుధాకర్, శామ్యూల్ వినతిపత్రం ఇచ్చారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం..!

- తగరపువలస పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అవస్థలు



జాతీయ రహదారి నుంచి తగరపువలస కూడలిలోకి వెళ్లే రహదారి

తగరపువలస: తగరపువలస కేంద్రంగా చుట్టూ నాలుగు వైపులా రహదారులు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో పద్మవ్యూహాన్ని తలపిస్తుంటాయి. అసలే ఇరుకైన రహదారులు.. పైగా ఎక్కడా వాహనాలకు పార్కింగ్ ప్రదేశం లేకపోవడంతో వాటి యజమానులు ప్రధాన రహదారి, అనుబంధ రహదారులు, చివరకు వీధుల్లోనూ ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపివేస్తుంటారు. ఒక్కోసారి ద్విచక్ర వాహనం పార్కింగ్ చేద్దామన్నా ఎక్కడా ఖాళీ ప్రదేశమన్నదే లేకుండా నిండిపోయి కనిపిస్తుంటాయి. బంగ్లామెట్ట నుంచి చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి వరకు ప్రధాన రహదారిలో నిత్యం సగభాగం చిరు వ్యాపారులు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కే సరిపోతుంది. ఇక విజయనగరం – విశాఖ, అనకాపల్లి – భోగాపురం, భీమిలి – విశాఖపట్నం పట్టణాల మధ్య వివిధ విద్యా సంస్థలకు చెందిన బస్సులతో ఉదయం, సాయంత్రం వేళల్లో తగరపువలస పురవీధులు నిండిపోతుంటాయి. ఒకవైపు నుంచి ఒక్క వాహనమే రాకపోకలకు వీలుండగా మిగిలిన వాహనాలను నిముషాల కొద్దీ నిలిపివేయాల్సి ఉంటుంది. ప్రధాన రహదారికి అనుబంధంగా ఉన్న గ్రంథాలయం, గాంధీబొమ్మ, పాతలోకల్ ఆఫీసు వీధి, శ్రీనగర్, కొండపేట, సంతబయలు, చిల్డ్రన్స్ కాన్వెంట్ రహదారులు, పెట్రోల్ బంకు సైతం పగటివేళ వాహనాలతో కిక్కిరిసిపోతుంటాయి.

బంగ్లామెట్ట రహదారిపై కన్ను..

తగరపువలస కూడలి చుట్టూ రహదారులు ఇరుకుగా మారిపోవడంతో ఇప్పుడు వ్యాపారస్తులు, వాహనాల యజమానుల దృష్టి జాతీయ రహదారి నుంచి బంగ్లామెట్ట మీదుగా తగరపువలస వైపు వచ్చే రహదారిపై పడింది. ప్రస్తుతం బడా వ్యాపారవేత్తలు ఈ మార్గంలోకి తమ వ్యాపారాలను మార్చుకోవడంతో ఇప్పుడీ రహదారి కూడా ఇరుకుగా మారుతోంది. సిటీ బస్సులను కూడలిలో నిలిపేందుకు స్థలం చాలకపోవడంతో బంగ్లామెట్ట శివాలయం వద్దే పదుల కొద్దీ బస్సులను సిబ్బంది గంటల కొద్దీ నిలుపుతుంటారు. బంగ్లామెట్ట రహదారికి ఇరువైపులా జాతీయ రహదారి వరకు రోజంతా వాహనాలు నిలిపివేస్తున్నారు. అసలే రద్దీగా ఉండే ఈ మార్గంలో వెంకటేశ్వరమెట్ట వద్ద పోలీస్ అవుట్‌పోస్ట్ ఉండటంతో ఒన్‌వేలోనే వాహనాలను అనుమతిస్తున్నారు. ఆదిలోనే ఈ రహదారికి ఇరువైపులా ఆక్రమణ, అనుమతి లేని పార్కింగ్ ప్రదేశాలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జీర్ణకోశ సమస్యల నివారణకు ప్రత్యేక శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో జీర్ణకోశ సంబంధ వ్యాధుల నివారణకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3వ తేదీ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశ్రాంత ఆయుర్వేద వైద్యుడు కె.ఈశ్వరరావు స్వయంగా రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు సూచించనున్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

మధురవాడ: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, నాయకులు టి.నూకరాజు, ఎ.జ్యోతిబసు, వి.వరలక్ష్మి, కె.లక్ష్మి, జేఆర్ నాయుడు డిమాండ్‌చేశారు. మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమై విజయవాడ వరకు సాగే యాత్ర గురువారం కొమ్మాది కూడలికి చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు, ఉద్యోగులు సీఐటీయూ ఆధ్వర్యంలో స్వాగతం పలికి సంఘీభావం ప్రకటించారు.

సింహగిరిపై శాస్త్రోక్తంగా నృసింహ హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నృసింహ హోమాన్ని గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో ఉన్న యజ్ఞశాలలో హోమం జరిపించారు. చక్రపెరుమాళ్లను ఆలయంలో నుంచి తిరువీధిగా తీసుకెళ్లి కల్యాణమండపంలో వేంజేపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులందరి చేత అష్టోత్తర శతనామావళి పఠింపజేశారు. కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు శ్రీకాంతాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జాగ్రత్తలతో మలేరియా నివారణ సాధ్యం



మాట్లాడుతున్న మలేరియా నివారణ అధికారి సూరిబాబు

భీమునిపట్నం: ప్రమాదకరమైన మలేరియా వ్యాధి సోకకుండా అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా నివారణ జోన్ అధికారి సూరిబాబు సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నిల్వ ఉంటే దోమలు భారీగా వృద్ధి చెందుతాయన్నారు. కాలువల్లో కూడా నీరు ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అవసరమైన జాగ్రత్తలు తీసుకుని నీరు నిలిచిపోకుండా చూసుకోవాలని కోరారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము మాట్లాడుతూ ఇళ్ల వద్దకు పారిశుధ్య సిబ్బంది వచ్చేటప్పుడు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందివ్వాలని కోరారు. అలాగే తడి, పొడి చెత్తను ఎలా సేకరించాలో అవగాహన కల్పించారు. పారిశుధ్య అధికారి మహాలక్ష్మి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఐశ్వర్య లక్ష్మి విగ్రహ ప్రతిష్ట



కొత్తగా ప్రతిష్ఠించిన ఐశ్వర్య లక్ష్మి అమ్మవారి విగ్రహం

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్ద గల ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో కొత్తగా నిర్మించిన మందిరంలో గురువారం ఐశ్వర్య లక్ష్మి అమ్మవారి విగ్రహం వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా త్రిదండి అహోబిల రామానుజ స్వామివారు విచ్చేయగా ఆయన పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తలు కలిగొట్లవారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సకల యంత్ర సహిత విగ్రహ, శిఖర ప్రతిష్ట, కుంభ ప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్తలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కేఎస్ఎన్ మూర్తి, కె.శ్రీనివాసరావు, కె.భానోజీరావు, కె.చంద్రశేఖర్, వి.తాతాజీ, ప్రసాద్‌శర్మ, బద్రి, అర్చకులు పురాణం శేషాచార్యులు పాల్గొన్నారు.

కమనీయం.. వేణుగోపాలుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో బుధవారం రాత్రి వేణుగోపాల స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి విగ్రహాలకు వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ, ఆలయ అర్చకుడు కుమ్మరిగుంట శ్రీరామాచార్యులు సహాయంతో వేద పండితులు కల్యాణం నిర్వహించారు. బుడిమిల్ల ఉదయ భాస్కరం, లక్ష్మి మణికుమారి దంపతులతోపాటు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కల్యాణాన్ని కనులారా వీక్షించారు. ఈవో నానాజీ బాబు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రాజాసాగి హరీష్‌కుమార్ వర్మ, పాండ్రంగి పీఏసీఎస్ అధ్యక్షుడు అముజూరి అప్పారావు, మాజీ ఎంపీపీ డి.గోపాల కృష్ణ మూర్తి రాజు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల దుకాణాలు తొలగించడం దారుణం



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న చిల్లర వర్తకులు

మధురవాడ: పొట్ట కూటికోసం రోడ్డు పక్కన చిల్లర వ్యాపారం ద్వారా ఉపాధి పొందుతున్న వర్తకులపై అధికారులే దాడులు చేయడం దారుణమని సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు ఆరోపించారు. మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులోని చిరువ్యాపారుల దుకాణాలు తొలగింపునకు నిరసనగా గురువారం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ పేదలైన చిల్లర వర్తకులు క్రమశిక్షణతో వృత్తి చేసుకునే విధంగా అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. వీధి విక్రయదారులకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వాలు పాటించడం లేదని ఆరోపించారు. చిల్లర వర్తకులపై దాడులు ఆపాలని, ఉపాధికి రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు చాంద్ పాషా, కె.కామేష్, ఎం.ఆదినారాయణ, ఎస్.కృష్ణ, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు సహకరించండి

- సచివాలయాల సిబ్బందితో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్

సీతమ్మధార: రాష్ట్రంలోని గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది యావత్తు భాగస్వాములై బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం కోరారు. సీతమ్మధారలో గురువారం 14, 15, 16 వార్డుల సచివాలయాలకు చెందిన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి ఆఖరి వరకు రాష్ట్ర స్థాయిలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ విభాగాలు, శాఖల అధికారిక యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కలిసి సమన్వయంతో పని చేస్తున్నాయి. ఈ తరుణంలో సచివాలయం సిబ్బంది పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలన్నారు. బడి బయట ఉన్న బాలలను గుర్తించి తిరిగి స్కూల్‌లో చేర్పించాలని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు తరచూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలలకు వైద్య పరీక్షలు, రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించేలా చూడాలని సూచించారు. దివ్యాంగ బాలలకు పెన్షన్ల జారీ, పాఠశాలల్లో చేర్పించేలా చర్యలకు యుద్ధప్రాతిపదికన ఆదేశాలు జారీ చేశారు. సమతుల్య పౌష్టికాహారాన్ని అందించే ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై డేగ కళ్లతో పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ కార్యదర్శులంతా విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ, ఇతర ధ్రువ పత్రాల జారీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, సచివాలయ ప్రతినిధులు బి.మహాలక్ష్మి, కె.వి.సాయిశ్రావణి, ఎస్.శిరీష, వి.వెంకటలక్ష్మి, వి.శ్యామల, వై.మంగ, బి.సతీష లావణ్య, హేమలత, ఆది, సోంబాబు, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

వీధి దీపాలు పునరుద్ధరించండి



పీఎం పాలెం చివరి బస్టాప్ నుంచి వెలగని లైట్లు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎం పాలెం చివరి బస్టాప్ నుంచి బాబా కళాశాలకు వెళ్లే రహదారిలో వీధి దీపాలు కొంతకాలంగా వెలగడం లేదు. నిత్యం చీకటి కారణంగా దొంగతనాలు, విష కీటకాల సంచారం, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యంత రద్దీగా ఉండే ఈ రహదారిపై వీధి దీపాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది తక్షణమే స్పందించి వీధి దీపాలను పునరుద్ధరించాలి.

– ఎం.జగన్నాథరావు, పీఎం పాలెం.